# కథకుడులో కథ

కథకుడు శబ్దము అనాది ప్రసిద్ధము. ప్రతి పురాణగాధకు మును ముందు అక్కథకుండిట్లనియె అనే సూచన మన క్కనిపిస్తుంది. మఱిన్నీ ఎవరైనా పొడుగ్గా నిజంచెప్పినా "అలా కధగా చెప్పకపోతే టూకీగా రెండు ముక్కల్లో చెప్పరాదూ" అని నివారిస్తాం. వీటిని బట్టి చూస్తే తొల్త కథ అన్నది పెద్ద అఖాత కల్పనగా చలామణీ అయినట్టు కనిపిస్తుంది. మఱిన్నీ, వాస్తవికంగా ఉన్నది ఉన్నట్టు చెప్పడం కథకుని లక్షణం కాదేమో కూడాను. కథ అన్నది కేవలం వచనంగా మున్ను చెప్పబడ్డట్టు కానరాదు. అది గద్యపద్యాత్మికంగా పండితుల మధ్యవుండేది. జన బాహుళ్యంమీద తఱచు పదరూపం దాల్చేది. మనం వింటూ వచ్చే "అనగనగా"లకు సారస్వత ప్రపంచంలో స్థానం పూర్వకాలమందు లేదనే చెప్పొచ్చు. ముసిలమ్మలు తమ మునిమనుమలకు మునిమనుమరాళ్ళకు కాలక్షేపంగా చెబుతూవచ్చే టర్రాయి బుర్రాయి కబుర్లె ఏపూట కాపూటే హరించి పోయావి. కథ కంచికి వెళ్ళిపోయేది. మన మధ్యనే ఉండేది కాదు.

అయితే ఇప్పుడు ఆధునిక సారస్వత ప్రపంచంలో కథ యొక్క రూపం ఏలాగ్గా పరిణమించింది? "ఊ" అంటే కథ. "ఆఁ" అంటే కథ.........చుక్కలు పెడితే కథ. అసలు నిశ్శబ్దంలో కథ పలుకుతూ ఉందా అన్నంత ఇదికి వచ్చేసింది.

ఆమె.....................

అతడు....................

అని సంభాషణ సూచిస్తూ కథ కేవలం........వీటితో ముగింప బడుతూవుంది. పాఠకుడు యోచించు కోవాలి. విను వాడు వినిపించేవాని ముఖం కేసి చూస్తూ గుండెలోతు ఆక లించాలి. వినిపించేవాడు "ఇది నా కల్పన కాదుసుమా. అంతా నిజంగా జరిగింది." అని విన్నవాణ్ణి సమాధాన పరచాలి.

ఈ పరిణామం కథా సారస్వతానికి ఏలా వచ్చిందీ అంటే అన్నిటికీ ఏలా వచ్చిందో దీనికీ ఆలాగ్గానే వచ్చింది అని జవాబు చెప్పాలిసిందే. మరో పంథా కానరాదు. సిసింద్రీ బాంబులో సింహనాదంలా, పొట్టిరైకలో కనుకట్టులా కుదించి, కుదించి, కుదించి రచించి కథలో ఊహాదార్ఢ్యం చొప్పించాలని ప్రస్తుత కాలపు గథకుల విశ్వప్రయత్నము అని నా నమ్మకం. చదివే ఆతడో తనకు మిక్కిలి తీరికవున్నా కథ అంతా అయిదు నిమిషాల్లో ఒక్కొక్కప్పుడు అరనిమిషంలో ముగియాలి!

వీరి ప్రయత్నాలకు సాయపడే పరికరాలు నాకు తెలిసి నంతలో మీ ముందు ఉంచడమనేదే యీ వ్యాసంయొక్క ముఖ్యోద్దేశ్యం.

పరికరాలు పలురకాలుగావున్నా మెట్టు విభజనచేసి చూస్తే స్థానం, జనం, సంఘటనం, ఈ మూడింటి మీదా సర్వ సాధారణంగా కథ అన్నది ఆధారపడి ఉంటుంది. శ్రీమద్రామా యణగాథ అయోధ్యలో పుట్టి, దండకారణ్యం అంతా చుట్టబెట్టి, లంక కగ్గి ముట్టించింది కాబట్టే అంతరమ్యంగా వుంది. వానరులు సేతువుకట్టడానికీ సముద్రం తరించడానికీ అవకాశం ఇచ్చింది. ఇది స్థాన విశిష్టత. తద్వతుగానే జన విశిష్టత, సంఘటన విశిష్టత ప్రతీగాథకూ ఉంటాయని మనం తెలుసుకోవాలి. గాథకేలాగో

కథకూ అలాగే! అయితే కథ యొక్క పరిమాణం చిన్నదిగా ఉండి మన చుట్టూవున్న పరిస్థితుల్ని గూర్చి మన సాంఘిక వ్యవస్థల్ని గూర్చి ముచ్చటిస్తుంది. యజ్ఞ యాగాదుల ఫలితంగా పుట్టడం ఇల్లాంటివి కథలో ఉద్రేకం కలిగించవు. ఉండవు. తిన్నగా నరలోకంలోని ఒక తావు చూపిస్తాం. రోడ్డుమీద దైనందినం పోల్చగలిగేటంత వివరంగా మనుష్యుల్నే అవతరింప జేస్తాం. వాళ్ళను ఆనంద సముద్రంలోనో దుఃఖ సముద్రంలోనో ముంచెత్తుతాం.

కథద్వారా ఆనందమో దుఃఖమో చూర గొంటాం. ముక్తిని మూచూడం. చదువుతూ విశాలతర లోకంలో పడుతూ ఇహలోక సౌందర్యం ఇహలోక నిరాశ మన హృదయాన్ని పెనేసుకు పోతూవున్నట్టు దిక్కులు చూపిస్తాం. ఇది ఉత్తమ కథ లక్షణం.

ఉదాహరణ కొక చిన్న కథవ్రాసి చూపిస్తాను. దాని సల్లక్షణం పాఠకులు! పరిశీలించండి.

"రోడ్డుమీద ఎండా చెట్లనీడా ఉండుండి మారుతూవున్న జాడనే పల్లెటూరిది, రెండెడ్ల మోటబండి పట్నం వెంపున నడుస్తూవుంది. బండినంటి వోరసిలగా పాంధురాలు, వస్తూ వాహనంలేని పల్లెటూరి పడుచొకర్తె అదే, పట్నానకు కాలి నడకను ముందుచూపున గబగబా పోతూవుంది. బండివాడు తొట్టిలో నిదరోతూ ఉన్నాడు. ఎడ్లుతమంతనే సాగుతూ వున్నాయి. వలప ఎద్దు బెదిరింది, ఏదో కార్ సందడికి. బండి యొక్క కాడి పాంధురాలి బుజాన్ని రాసుకుపోయింది. బండి వాడలా నిదరోతూనే ఉన్నాడు. లోతు తొట్టిలో అలా

నిదరోతూనే ఉన్నాడు. పైకి కాపడ్డంలేదు. ఎవర్ని తిడుతుంది పాంధురాలు ?

"బండివా దేమైపోయినాడో వీడిజిమ్మడ ! బండి నామీద కెక్కేశాడు నామీద కెక్కేశాడు. చచ్చిపోయీ దాన్నికందా కాడి కాక సెక్రం తగిల్తే, బండివా దేమైపోయినాడో వీడి జిమ్మడ !" అని తిట్టిపోసికొంటూ తన జబ్బ తడుముకుంటూ బండీకి వెను కయి తడికట్టుకుంది. బండీనడక అరికట్టాలనో లేక బండీ నమాంతంగా బోల్తాకొట్టిద్దామనో ? బండివాడా చేష్ట కులిక్కిపడి లేస్తూ వెనక్కుచూచి "ఎద్దును బెదరగొట్టింది ఎవురమ్మీ ! నువ్వా ?" యని అడిగాడు పాంధురాల్ని.

"ఆ ! నేనే !—నా చేతుల్ని గాజులు మెఱసి పోతు న్నాయి. నా కాళ్ళకు మట్టెలున్నాయి ! నా మొలకు బంగారు మువ్వలున్నాయి ! నా సీరకు రంగుంది ! నా నడకలో పొంగుంది. ఆ ! నేనే !—నీ జిమ్మడ ! సెక్రంతప్పి కాడే తగలమట్టి బ్రతికి పోయావు, కాకపోతే ఏకాడుందువో యీపాటికి ? ఉరిస్తంభం అరుగెక్కి యుందువు. మేలు కున్నా కుని తోలుకోబండి ! మేలు కున్నా కుని తోలుకోబండి !" అని హెచ్చరించింది ఆమె.

"నా నురిస్తంభం అరుగెక్కి ఈ ప్రాణం పోతూవుంటే నీ సచ్చిన కళ్లూరుకుంటాయా ? ఏడ్చేయ్యావు ? ఆ పొద్దేడ్చేయ్యావు? ఏ పొద్దూ ఏడ్చేయ్యావు ?" అన్నాడు బండన్న చిరునవ్వు నవ్వుతూ. వానివయస్సు పాతిక మీద రెండేండ్లు. వాని చెవులకు తెల్లపొళ్ళకమలా లున్నాయి. వాని బండి చిరతలకు ఇత్తడి కట్లున్నాయి !

పడుచుపిల్ల కళ్ళల్లో కమలాలూ కట్లేకాకుండా ఆ కోడె కాని పాతికమీద రెండేండ్లూకూడా సూటిగా ప్రతిబింబాలానాయి!"

.... .... .... .... ....